క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలి



వినోద్‌కుమార్‌కు వివరిస్తున్న ఎంపీటీసీ

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను శనివారం ఎంపీటీసీ సభ్యురాలు సంబబుచ్చమ్మ హైదరాబాద్‌లో కలిశారు. ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు గాను బీటీరోడ్డు ఏర్పాటుతో పాటు లైటింగ్, కొదురుపాక వెళ్లే రోడ్డులో హై లెవల్ బ్రిడ్జికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశానరు. బ్రిడ్జి కూలిపోయే ప్రమాదముందని, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు, తదితరులున్నారు.

పరామర్శ

రుద్రంగి: శుక్రవారం గుండెపోటుతో మృతిచెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, మండలకేంద్రానికి చెందిన వెంగళ కొమురయ్య గౌడ్ కుటుంబ సభ్యులను శనివారం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, నాయకులతో కలిసి పరామర్శించారు. కొమురయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్‌గౌడ్, నాయకులు, తదితరులున్నారు.

బీజేపీలో చేరిక

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ హాజరయ్యారు. గ్రామంలోని పలువురు యువకులు బీజేపీలో చేరగా వారికి రూరల్ అధ్యక్షుడు జక్కుల తిరుపతి, తుల ఉమ కండువా కప్పి ఆహ్వానించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

తంగళ్లపల్లి: మండెపల్లికి చెందిన లింగం పరశురాములు ఇటీవల దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. పరశురాములుతో చదివిన 2003–04 పదో తరగతి బ్యాచ్ స్నేహితులు బాధిత కుటుంబానికి చేయూత అందించారు. రూ.10వేలు పోస్టల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ తోపాటు 25 కేజీల బియ్యం అందించారు.

578 'డబుల్' ఇళ్లు కేటాయింపు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని 578 మందికి శనివారం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా కేటాయించారు. శనివారం తన కార్యాలయంలో ఆన్‌లైన్ పద్ధతిలో లబ్ధిదారులకు ఫ్లాట్స్, బ్లాకులను కేటాయించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, కమిషనర్ ఆయాజ్, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీలో దూరిన పాము

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ వద్ద నిలిపి ఉన్న స్కూటీలోకి పాము దూరింది. శనివారం పాతబస్టాండ్‌లో షబ్బీర్ అనే వ్యక్తి తన స్కూటీని ఓ షాప్ ముందు పార్క్ చేయగా.. అందులోకి ఓ పాము దూరింది. గమనించిన స్కూటీ యజమాని అక్కడున్న మెకానిక్‌కి తెలిపి, స్నేక్ క్యాచర్‌కి సమాచారం అందించారు. గంటపాటు శ్రమించి బండి విడి భాగాలను తొలగించి పామును పట్టుకున్నారు. పట్టుకున్న పామును బాటిల్‌లో బంధించి జన సంచారం లేని ప్రాంతంలో వదిలేశారు.

లేబర్ అడ్డాలో గొడవలు నిరోధించాలి



సిరిసిల్లటౌన్: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో జిల్లా కేంద్రంలోని లేబర్ అడ్డాలో తరచూ గొడవలు జరుగుతున్నాయని వాటిని నిరోధించాలని భవన నిర్మాణ కార్మికులు కోరారు. ఈమేరకు శనివారం సిరిసిల్లటౌన్ సీఐ ఉపేందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ మాట్లాడుతూ లేబర్ అడ్డాకు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన పలువురు కార్మిలు మద్యం సేవించి రావడంతో ఆ ప్రాంతం నుంచి వచ్చి వెళ్లే విద్యార్థులు, ఆలయాలకు వెళ్లే భక్తులకు, మహిళలకు ఇబ్బందిగా ఉంటుందన్నారు. సీఐ ఉపేందర్ స్పందిస్తూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఇద్దరు కానిస్టేబుళ్లతో పహారం చేయిస్తామని హామీ ఇచ్చారు.

సంస్కారవంతమైన విద్యనందించాలి

సిరిసిల్లటౌన్: నేటితరం పిల్లలకు సంస్కారవంతమైన విద్యనందించాలని విద్యాభారతి క్షేత్ర అధికారి లింగం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మాతృమండలి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. పాఠశాల నిర్వాహకులు గోగూరి నాగేందర్‌రెడ్డి, రాపెల్లి ముకుందం, చేపూరి నాగరాజు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

భగ్గుమన్న నిరసనలు

- సిరిసిల్లలో నిరసన ప్రదర్శనల హోరు
- సర్కారు తీరుపై, టెట్ నిర్వహణపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- అంగన్‌వాడీ, సమగ్ర శిక్ష ఉద్యోగుల వినూత్న నిరసన
- ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం నిరసనలతో హోరెత్తింది. సమగ్ర శిక్ష, అంగన్‌వాడీ ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వరుస కార్యక్రమాలతో బీఆర్ఎస్ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ..ఆందోళనలు చేపట్టారు.

మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

టెట్ పరీక్ష నిర్వహణలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. సిరిసిల్లలో ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఏబీవీపీ నాయకులు పాత బస్టాండులో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. వక్తలు మాట్లాడుతూ..టెట్ నిర్వహించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. మెడికల్ కళాశాల ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి కేటీఆర్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగ సభతో అభ్యర్థులు అవస్థలు ఎదుర్కొన్నారన్నారు. పోలీసులు, విద్యార్థి సంఘాల నాయకుల మధ్య తోపులాట జరగగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ రంజిత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గాంతుల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అధోగతి



తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ పిలుపునిచ్చారు. శనివారం సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్ వద్ద నిరవధిక దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు ఆమె సంఘీభావం తెలిపారు. సీఎం కేసీఆర్ దురహంకారంతో పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు ఉద్యోగాలు తెలంగాణాలో ఉండవని అన్నీ సర్కారు ఉద్యోగాలే అంటూ..ఇచ్చిన హామీలు తుంగలో తుక్కారన్నారు. అంగన్‌వాడీలకు తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

సర్వశిక్షా ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనతో సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

తమ ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. అర్ధనగ్న ప్రదర్శనతో ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సమగ్ర శిక్షలో అసువులు బాసిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నాయకులు తుమ్మ రాజేందర్, అబ్దుల్ కయ్యూం, కత్తి జయలక్ష్మి, చిప్ప నవీన్, నీరజ, శ్రీనివాస్, సలీం, నరేశ్, వెంకటస్వామి, ఉపేందర్ తదితరులున్నారు.

'కాంగ్రెస్ విమర్శించే నైతిక హక్కు లేదు'



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్లఅర్బన్: కాంగ్రెస్ పార్టీని విమర్శించే నైతిక హక్కు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నియోజవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృతజ్ఞత సభలో మంత్రి కేటీఆర్ చేసిన వాఖ్యలపై మండిపడ్డారు. గల్లీ లీడర్లు కావాలా, ఢిల్లీకి గులాంగిరి చేసే లీడర్లు కావాలా అని మాట్లాడిన కేటీఆర్ ఆ ఢిల్లీ డీసీషన్‌తోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కృతజ్ఞత సభతో టెట్ అభ్యర్థులు, రోగులు తీవ్రం ఇబ్బందులు పడ్డారన్నారు. కాళేశ్వరంలో మోటార్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా చేయించిన పాపాన పోలేదన్నారు. ఓ ప్రశ్నాపత్రంకు బదులు మరో ప్రశ్నపత్రం ఇచ్చిన టెట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు రాజు, మునిగెల రాజు, భరత్, సత్యనారాయణ, అన్నల్‌దాస్ భాను,తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం



వస్తువులు అందజేస్తున్న సీఐ, సొసైటీ సభ్యులు

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు బాగున్నాయని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్ అభినందించారు. మండలంలోని ఆవునూర్‌లో వర్షం ధాటికి నష్టపోయిన కుటుంబాలకు రెడ్‌క్రాస్ సొసైటీ నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ లలిత, రెడ్‌క్రాస్ సొసైటీ బాధ్యులు గుడ్ల అనిల్, ప్రయాకర్‌రావు వేణు, నాయకులు భాను, క్రాంతి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మసీద్ కమిటీ, పలు దుకాణాలలో సీఐ సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, మసీద్ కమిటీ బాధ్యులు కరీం, కోఆప్షన్ సభ్యుడు సర్వర్, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో వైద్యుల పోస్టుల భర్తీ

సిరిసిల్లటౌన్: నేషనల్ హెల్త్ మిషన్ పథకం ద్వారా బస్తీ దవాఖానాలు, పీహెచ్‌సీల్లో పనిచేయుటకు వైద్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు తెలిపారు. ఈమేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో(2), పీహెచ్‌సీలో(4) వైద్యాధికారుల పోస్టులు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఎంబీబీఎస్ పూర్తి చేసి, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిష్టర్డ్ అయి ఉండాలని తెలిపారు. అర్హులు ఈనెల 19 నుంచి 23 వరకు తన కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని కోరారు.

అర్హులకే 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకుల

ఇల్లంతకుంట: అర్హులైన వారికే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని మండలంలోని వల్లంపట్ల గ్రామానికి కొందరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బీజేపీ దళితమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు కేవలం బీఆర్ఎస్ నాయకులకే అందుతున్నాయన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, పిట్టల అశ్విని, శ్రీనివాస్, గంగాధర్, సంపత్, కిషన్, ముత్తక్క, రంజిత్, అవినాష్, లక్ష్మణ్, అనిల్, ప్రశాంత్, కృష్ణ, మల్లేశం, అశోక్, రాజిరెడ్డి, చంద్రం, శ్రీనివాస్, తదితరులున్నారు.

విద్యార్థులకు అల్పాహారం

బోయినపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉదయం అల్పాహారం అందిస్తుందని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని హైస్కూల్‌లో ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస దీక్షిత్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ చిక్కాల సుధాకర్ రావు, నాయకులు శంకర్, ఒంటెల రాజగోపాల్ రెడ్డి, హెడ్ మాస్టర్ ప్రేమలత, తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ముస్తాబాద్: బేడ బుడగ జంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద బేడ బుడగ జంగాలు ఈనెల 18న జరిగే ఐక్యవేదిక మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యా వైద్యంలో బేడబుడగ జంగాలకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. వెనుకబాటుకు గురైన బేడ బుడగ జంగాల సంక్షేమం కోసం కార్పొరేషన్‌ను మంజూరు చేసి నిధులు కేటాయించాలన్నారు. 18న హైదరాబాద్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయాలన్నారు.

సంక్షిప్త వార్తలు

వైద్య కళాశాల ప్రారంభంపై హర్షం

సిరిసిల్లఎడ్యుకేషన్ : జిల్లాలో వైద్యకళాశాల ఏర్పాటుతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని పద్మశాలి టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దేవత ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి జక్కని నవీన్ అన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సిరిసిల్లఅర్బన్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం అన్నారు. పోషణ మాస వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ నగర్ పాఠశాలలో పోషణ మాస ఉత్సవాలను నిర్వహించారు. తాజా కూరగాయలు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకునూరి నిర్మల, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ బాలకృష్ణ, సూపర్‌వైజర్ అంజలి, టీచర్ల, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

వేములవాడ: పట్టణంలోని బీమేశ్వర గార్డెన్‌లో ఆదివారం నిర్వహించే జిల్లాస్థాయి ముదిరాజ్‌ల భవిష్యత్ కార్యాచరణ సమావేశాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ నాయకులు కోరారు. వేములవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. జిల్లా కోర్ కమిటీ సభ్యులు చొక్కల రాము, మల్లికార్జున్, పిట్టల భూమేశ్, బొజ్జ కనుకయ్య, లక్ష్మణ్, మోహన్, పుల్లయ్య పాల్గొన్నారు.

సర్పంచ్‌కు అభినందన

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 జిల్లా స్థాయి అవార్డు దక్కడంతో సర్పంచ్ తూంకుంట శ్రీలత నరేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మధులను జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి అభినందించారు.

భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులు శనివారం భూమిపూజ చేశారు. చీకోడులో అర్హులైన లబ్ధిదారులకు గతంలో మంజూరు చేసిన ఇళ్లను వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శరత్ రావు కోరారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సర్పంచ్ రజిత, ఎంపీటీసీ సవిత, దేవేందర్ పాల్గొన్నారు.

ఒకరికి గాయాలు

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న ఆటోను బైక్ ఢీ కొనగా గుర్తు తెలియని వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం కొదురుపాక వైపు నుంచి వేములవాడ వెళ్తున్న టేలర్ ఆటో ఫోర్‌లేన్ వంతెన వద్ద ఆగి ఉంది. వేములవాడ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఆటోను ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు.

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని ఎంపీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో శిరీష హాస్పిటల్ వైద్యులు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు మౌని మధుకిరణ్, వైద్య సిబ్బంది, కౌన్సిలర్ ఒగ్గు ఉమ, తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

రుద్రంగి: మండలకేంద్రానికి చెందిన బింగి రమాదేవి ఈనెల 7న మండలకేంద్రంలోసెల్‌ఫోన్ పోగొట్టుకుంది. సీఈఐఆర్ గుర్తించి పోలీసులు శనివారం బింగి రమాదేవికి అప్పగించారు. కార్యక్రమంలో రుద్రంగి ఎస్సై రాజేశ్, కానిస్టేబుల్ పద్మారావు, మహిళా కానిస్టేబుల్ తదితరులున్నారు.

జీపీ కార్మికులకు సర్కార్ మొండిచేయి



సిరిసిల్లటౌన్: గ్రామపంచాయితీ కార్మికులు గతంలో సమ్మె చేయగా.. డిమాండ్లు నెరవేరుస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం తర్వాత పట్టించుకోకుండా మొండి చేయి చూపిందని జీపీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకయ్య విమర్శించారు. సిరిసిల్లలోని ఆర్ఎంపీ భవనంలో శనివారం జిల్లా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గతంలో సమ్మె చేయగా పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే తమ సమస్యలు పరిష్కరించలేదన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అక్టోబర్ 2 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. ఎల్లారెడ్డి, మూశం రమేశ్, రమణ, శ్రీనివాస్, పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లోకి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- బీఆర్ఎస్‌లో పలువురు చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

బోయినపల్లి(చొప్పదండి): సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి కొమ్మనబోయిన సుధీర్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. శేఖర్, శివకల్యాణ్, విక్రమ్ కిశోర్, అరుణ్, హరీశ్, నరేశ్, వినయ్, కత్తెరపాక శేఖర్, మధు, చంద్రశేఖర్ తదితరులున్నారు.

వాడీవేడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎంపీపీ జనగామ శరత్‌రావు అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో అధికారుల తీరుపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండిపడ్డారు. బీసీ, మైనార్టీ బంధు లబ్ధిదారుల ఎంపికలో తమకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీటీసీలు శ్రీనివాస్, స్వేచ్ఛ, లలిత, సర్పంచ్‌లు రజిత, సరిత సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఎంపీడీవో ఏకపక్షంగా అర్హులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను బీసీ బంధుకు ఎంపిక చేశారన్నారు. గూడూరు అభివృద్ధికి సీఎం కేసీఆర్ స్వయంగా రూ.కోటి కేటాయిస్తే పంచాయతీ భవనం పూర్తి చేయకుండా కొందరు అడ్డుకుంటున్నారని సర్పంచ్ రమేశ్ తెలిపారు. ఎంపీపీ శరత్ రావు సముదాయించి ఈఈతో మాట్లాడారు. గూడెంలో అంగన్‌వాడీ ఆయా పోస్టును భర్తీ చేయాలని ఎంపీటీసీ శ్రీధర్ కోరారు. ముస్తాబాద్‌లో శ్మశాన వాటికలో లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పంట పరిహారం ఇప్పటికీ అందలేదని ఎంపీటీసీ శ్రీనివాస్ అన్నారు. ముస్తాబాద్‌లో లైబ్రరీకి భవనం, డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని సభ్యులు కోరారు. గూడూరు స్కూల్‌కు టీచర్లను నియమించాలని సర్పంచ్ కోరారు. అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ తెలిపారు. మంత్రి కేటీఆర్ సహకారంతో అభివృద్ధి జరిగిందన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, వైస్ ఎంపీపీ లలిత, ఎంపీడీవో రమాదేవి, డీటీ సురేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఇల్లంతకుంట: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట: ప్రధానమంత్రి మోదీ కుల వృత్తులపై ఆధారపడిన వారికి విశ్వకర్మ యోజన పథకం ప్రవేశపెట్టి 30 లక్షల కుటుంబాలకు చేయూనందిస్తున్నందున బీజేపీ నాయకులు శనివారం మండలకేంద్రంలో చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీజేపీ దళితమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ మాట్లాడారు. చేతి వృత్తులపైనే ఆదారపడి జీవిస్తున్న తరుణంలో వారికి ఆర్థికంగా అండగా నిలవాలనే సంకల్పంతో ప్రధాని మోదీ 13వేల కోట్లతో విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, శ్రీనివాస్, గంగాధర్, సంపత్, రంజిత్, అవినాశ్, అనిల్, ప్రశాంత్, కృష్ణ, మల్లేశం, అశోక్ తదితరులున్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో విశ్వకర్మ యోజన 18 చేతివృత్తి దారులకు బాసటగా ఈనెల 17న అధికారికంగా ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన అమలు ఏర్పాటు చేసిన సందర్భంగా బీజేపీ నాయకులు ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు అబ్బినవేని తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శులు తిరుపతి, నరేశ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సెస్ మాజీ మండల డైరెక్టర్ కొక్కు దేవేందర్ యాదవ్, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు మురళి మోహన్‌గౌడ్, జిల్లా కార్యదర్శి మేకర్తి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, టేకుమల్ల రాజు, దేవరాజు, స్వామి, సర్వోత్తం, రాజుగౌడ్, దుర్గేశ్, దేవరాజు గౌడ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో విద్యుదాఘాతం

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ కేజీబీవీలో శనివారం విద్యుదాఘాతం చోటుచేసుకోగా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి పరిశీలించారు. విద్యాలయంలో ప్రత్యేకాధికారి కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు లేచాయి. విద్యుత్ వైర్లు కాలిపోయాయి. ప్రత్యేకాధికారి గదిలోనే ప్రమాదం జరగగా.. విద్యాలయంలోకి మంటలు రాకుండా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అల్మాస్‌పూర్ చేరుకుని వివరాలు సేకరించారు. విద్యాలయంలో లూజ్ కనెక్షన్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎంపీడీవో చిరంజీవి, ఎంపీపీ రేణుక, సర్పంచ్, కార్యదర్శి ఉన్నారు.

మట్టి వినాయకులనే పూజించాలి



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న డీఈవో

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని జిల్లా బాలికల ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలు డీఈవో రమేశ్‌కుమార్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయులనే పూజించాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు భాగ్యరేఖ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు శనివారం మట్టి వినాయకులను పంపిణీ చేశారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని మండలకేంద్రంలోని ప్రైవేట్, ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలతో రసాయనాలు నీటిలో కలిసి కలుషితమవుతుందన్నారు. మట్టి వినాయకులను తయారుచేసిన విద్యార్థులు వాటిని పంపిణీ చేశారు.

మట్టిగణపతుల తయారీ

వేములవాడఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం మట్టి వినాయకులను తయారు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'మల్కపేట'కు కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలి

సిరిసిల్లఅర్బన్: తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా మల్కపేట రిజర్వాయర్‌కు మాజీ ఎమ్మెల్యే కర్రోల్ల నర్సయ్య పేరు పెట్టాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ విముక్తి కోసం రజాకార్లతో పోరాడిన యోధుడు కర్రోల్ల నర్సయ్య అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి, మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మల్లేశం, సత్యం తదితరులు ఉన్నారు.